సాక్షి నిజామాబాద్

గురువారం : 5 : జనవరి : 2023



ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



పట్టపగలే దొంగతనం

బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లో దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.1 /19.9

పొగమంచు కురుస్తుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలితీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

హెల్త్ ప్రొవైడర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో 58 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టులను ఎన్‌హెచ్‌ఎం ద్వారా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 7 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం (201 నంబర్)లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా ఎంబీబీఎస్ వారితో పోస్టులను భర్తీ చేస్తామని, తదుపరి ఆయుర్వేదిక్, స్టాఫ్, బీఎస్సీ నర్సింగ్ అర్హత గల వారితో భర్తీ చేస్తామన్నారు. ఎంబీబీఎస్, ఆయుర్వేదిక్ చదివిన వారికి నెలకు రూ. 40వేతనం, బీఎస్సీ నర్సింగ్, స్టాఫ్ నర్సులు చదివిన వారికి నెలకు రూ. 29,900 వేతనం ఉంటుదన్నారు. పూర్తి వివరాలు nizamabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు.

ఏఎన్‌ఎంల నియామకాల్లో న్యాయం చేయాలి



సుభాష్‌నగర్: వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల భర్తీ చేసిన ఏఎన్‌ఎం పోస్టుల భర్తీలో బీసీ–ఈ కేటగిరికి చెందిన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, న్యాయం జరిగేలా చూడాలని ఏఐఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షకీల్ అహ్మద్ ఫాజిల్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇదే అంశంపై ఏఐఎంఐఎం పార్టీ చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఫోన్‌లో కలెక్టర్‌ను సంప్రదించి, వివరాలు ఆరా తీశారు. ఏఎన్‌ఎం పోస్టుల భర్తీలో బీసీ–ఈ కేటగిరీకి జరిగిన అన్యాయాన్ని సవరించాలని కోరారు. ఈసందర్భంగా షకీల్ అహ్మద్ ఫాజిల్ మాట్లాడుతూ ఏఎన్‌ఎం పోస్టుల భర్తీలో బీసీ–ఈ రోస్టర్ పాయింట్‌ను పాటించకపోవడంతో అభ్యర్థులకు అవకాశం దక్కకుండా పోయిందన్నారు. బీసీ–ఈ కేటగిరీ వారికి తప్పనిసరిగా న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. కలెక్టర్‌ను కలిసిన కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మహమ్మద్ ఇద్రీస్ ఖాన్, ఎంఐఎం పట్టణ కార్యదర్శి షాహబాజ్ అహ్మద్, సంయుక్త కార్యదర్శి ఎజాజ్ హుస్సేన్ ఉన్నారు.

పత్తి రైతులకు రూ. 5వేలు బోనస్ ఇవ్వాలి



సుభాష్‌నగర్: రాష్ట్రంలో పత్తి వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను క్రమంగా తగ్గిస్తున్నారని, వెంటనే పత్తికి క్వింటాలుకు రూ. 5వేలు బోనస్ ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాయల చంద్రశేఖర్, ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది పత్తి క్వింటాలుకు రూ. 15వేల వరకు ధర పలికిందని, వారం రోజుల నుంచి వ్యాపారులు పత్తి ధరను తగ్గిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రూ. 9వేలకు మించి ధర పలకడం లేదన్నారు. త్వరలోనే ఈ విషయమై చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్రబాధ్యులు రంగయ్య, బాబన్న పాల్గొన్నారు.

పరుగులు తీస్తున్న పుత్తడి!

10 గ్రాముల ధర రూ.56 వేలు

సాక్షి, కామారెడ్డి: బంగారం ధరలు రోజురోజుకూ పైకి ఎగబాకుతున్నాయి. పది రోజులుగా ధర పెరుగుతూ వస్తోంది. జిల్లాలో బుధవారం మధ్యాహ్నానికి పది గ్రాముల బంగారం ధర రూ.56,100 లకు చేరింది. సాయంత్రం వరకు 55,850 లకు తగ్గింది. ఇటీవలి కాలంలో ఇదే ఎక్కువ ధర అని బులియన్ మార్కెట్ వర్గాలు తెలిపాయి. బంగారం ధరలు పెరుగుతుండడం సామాన్యులను ఆందోళనకు గురిచేస్తోంది. బంగారం కొనలేని పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కానప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడంతో ఇక్కడా ధరలు పరుగులు తీస్తున్నాయి. పెరుగుతున్న బంగారం ధరలతో కొనుగోళ్లు మందగించాయని, దీంతో పనులు దొరకడం లేదని స్వర్ణకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్యాంగ్‌వార్ వెనక

అక్రమ దందా..



- రౌడీషీటర్లే కవచంగా పీడీఎస్ బియ్యం మాఫియా హవా
- ఆధిపత్య పోరు.. అవలీలగా హత్యలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలో రౌడీషీటర్ల మధ్య ఆధిపత్య పోరు ఒకవైపు నడుస్తుండగా, మరోవైపు సదరు రౌడీషీటర్ల గ్యాంగ్‌వార్‌కు ఆజ్యం పోస్తున్న అంశాల్లో పీడీఎస్ బియ్యం దందా ప్రధానంగా మారింది. పరిస్థితి ఏవిధంగా తయారైందంటే అవలీలగా హత్యలు చేసుకునే స్థాయికి వచ్చింది. తాజాగా నగరంలో రౌడీషీటర్ ఇబ్రహీం చావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు (29)ను మరో రౌడీషీటర్ ఆరిఫ్‌డాన్ అనుచరులతో కలిసి హత్య చేయడం కలకలం సృష్టించింది. నగరంలోని ఒకటి, రెండు, ఐదు, ఆరు టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గ్యాంగ్‌వార్ ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలో సాధారణ పౌరులు భయాందోళనలకు గురవుతున్నారు. కాగా నగరంలో వివిధ రకాల అక్రమ దందాలు చేస్తున్న వ్యక్తుల మధ్య ఆధిపత్య పోరు కాస్తా రౌడీషీటర్లను పెంచిపోషిస్తుండడం, గ్యాంగ్‌వార్లు, హత్యలకు కారణాలవుతున్నాయి.

■ రౌడీషీటర్ల హవా..

నగరంలోని ఒకటి, రెండు, ఐదు, ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పీడీఎస్ బియ్యం, గంజాయి, మట్కా, భూ మాఫియా, మామూళ్ల వసూళ్ల దందా ఎక్కువగా జరుగుతోంది. రాత్రి సమయాల్లో ఎక్కువగా ఈ దందా నడుస్తోందన్నది బహిరంగ రహస్యమే. ఈ ప్రాంతాల్లో బహిరంగంగా పీడీఎస్ బియ్యం తరలించిన సందర్భాల్లో పోలీసు అధికారులకు సమాచారం అందిస్తే, ఈ విషయం నిమిషాల్లో పీడీఎస్ బియ్యం వ్యాపారులకు తెలుస్తోంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన వాళ్లను భయపెడుతుండడం పరిపాటిగా మారింది. వినకుంటే రౌడీషీటర్లను రంగంలోకి దింపుతున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారులకు స్థానిక పోలీసులు ఎంతగా సహకరిస్తున్నారో మచ్చుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

■ మారణాయుధాలతో తిరుగుతున్నా..

నగరంలో వారంలో రెండు కత్తిపోట్ల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయితే పోలీసులు మాత్రం తాత్కాలికంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. నగరంలో కత్తుల సంస్కృతి పెరిగిపోయి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి మారణాయుధాలు భారీగా వస్తున్నప్పటికీ పోలీసులు అరికట్టలేకపోతున్నారనే విమర్శలున్నాయి. రౌడీషీటర్లు ఎప్పుడు గొడవలకు దిగినా కత్తులతోనే దాడులు చేస్తున్నారు. ఇటీవల తన ఆటో ఎక్కకుండా మరో ఆటో ఎక్కినందుకు ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసే ప్రయత్నం చేయడం గమనార్హం. రౌడీషీటర్ల విషయమై పోలీసులు సరైన నిఘా పెట్టలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముగ్గురు వ్యక్తుల చేతుల్లోనే..

నగరంలో పీడీఎస్ బియ్యం అక్రమ దందా ముగ్గురు వ్యక్తుల కనుసన్నల్లో నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఒక వ్యక్తి దందా అంతర్ జిల్లాల్లో విస్తరించింది. ఈ దందా నిర్వాహకులు రౌడీషీటర్లను కవచంగా ఏర్పాటు చేసుకుని మూడు పువ్వులు ఆరు కాయలుగా అక్రమ వ్యాపారం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ దందా జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. అంతర్ జిల్లాలో పీడీఎస్ బియ్యం వ్యాపారం విషయంలో ఇద్దరు రౌడీషీటర్ల మధ్య పంపకాల్లో తేడాలు రావడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నట్లు తెలుస్తోంది. నగరంలోని సారంగపూర్‌లో ఇబ్రహీం చావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు, ఆరిఫ్ డాన్ మధ్య వివాదం, ఇబ్రహీం చావూస్ హత్యకు ఈ వ్యవహారమే కారణమని ప్రచారం జరుగుతోంది. ఈ ఘటన జరిగిన వెంటనే పీడీఎస్ బియ్యం వ్యాపారులు పరారైనట్లు సమాచారం.

పోలీసుల అదుపులో 12మంది

- రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల అరెస్టు
- ముగ్గురు పరారీ
- కారు, బుల్లెట్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు

ఖలీల్‌వాడి: రౌడీ షీటర్ ఇబ్రహీం చావూస్ హత్య కేసులో 12 మందిని అరెస్ట్ చేశామని, ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇబ్రహీం చావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు, సయ్యద్ ఆరిఫ్ అలియాస్ ఆరిఫ్ డాన్‌తో పాటు అతని అనుచరులు చాలకాలంగా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇద్దరిపై ఒకటి, ఐదు, ఆరోటౌన్ పోలీస్ స్టేషన్‌ల్లో కేసులు నమోదు కాగా ఇప్పుడు ట్రయల్‌లో ఉన్నారు. ఇబ్రహీం చావూస్, ఉస్మాన్, ఆరిఫ్ డాన్‌లపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఏడాది క్రితం ఆరిఫ్ డాన్, ఉస్మాన్ విడుదల కాగా, ఇబ్రహీం మూడు నెలల కింద జైలు నుంచి విడుదల అయ్యాడు. ఈ మూడు నెలల నుంచి ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం కక్ష సాధించాలని సమయం కోసం వేచి చూస్తున్నారు. పీడీఎస్ బియ్యం, భూతగాదలలో ఇబ్రహీం వాటా అడుగుతున్నాడని, ప్రతి విషయంలో అడ్డు తగులుతున్నాడని, అతడిని హతమారిస్తే అడ్డంకులు ఉండవని భావించిన నేరస్తులు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా నిందితులు ఈనెల 1న షేక్ అర్షద్ పుట్టిన రోజు పార్టీకి అందరూ వెళ్లారు. షేక్ అర్షద్, ఖాజాబేగ్‌ల ద్వారా ఇబ్రహీంను నెహ్రూ నగర్‌లోని బషీర్ ఫార్మ్‌హౌస్‌కి పిలిపించారు. పుట్టిన రోజు వేడుకల్లో ఒక పాట గురించి ఉద్దేశపూర్వకంగానే ఇబ్రహీంతో నిందుతులు గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఇబ్రహీంను నిందితులు పట్టుకోగా ఆరిఫ్ డాన్, అమీర్ అలీఖాన్ అలియాస్ బర్సాద్ అమీర్‌లు వెంట తెచుకున్న కత్తులతో పొడిచారు. కత్తులతో దాడి చేయడంతో ఇబ్రహీం మురికి కాలువలో పడిపోయాడు. దీంతో అతని తల, మొహంపై ఎజాస్, అమ్జద్‌లు బండరాళ్లు వేశారు. మరో ముగ్గురు నిందితులు సయ్యద్ ఉస్మాన్, రెహమాన్, నబీలు పరారీలో ఉన్నారు. 12 మంది నిందితులను బుధవారం సారంగపూర్ శివారు ప్రాంతంలో పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి కారు, బుల్లెట్, కత్తులు, ముగ్గురు నిందితుల నుంచి రక్తపు దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య నిషాద్‌సానియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సౌత్ రూరల్ సీఐ జగడం నరేశ్, ఆరోటౌన్ ఎస్సై టి.సాయికుమార్, రూరల్ ఎస్సై లింబాద్రి, మోపాల్ ఎస్సై మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్, పక్కన సీఐ జగడం నరేశ్

రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలి



యువజనోత్సవాల్లో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- ఆకట్టుకున్న యువజనోత్సవాలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజనోత్సవాలు ఆకట్టుకున్నాయని.. రాష్ట్రస్థాయిలో ఇదే స్ఫూర్తితో విజేతగా నిలవాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. బుధవారం జిల్లాస్థాయి యువజనోత్సవాలు నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద నృత్యం, జానపద గీతం, వక్తృత్వ పోటీలు అలరించాయి. జానపదనృత్యం(గ్రూప్)లో గంగోత్రి గ్రూప్(విజేతగా), సాత్విక(రన్నర్)గా నిలిచారు. జానపదగీతంలో పాటమ్మ(గ్రూప్)(విజేతగా), శ్రీవిద్య(రన్నర్)గా నిలిచారు. వక్తృత్వం చందన(విజేతగా), అక్షిత(రన్నర్)గా గెలుపొందారు. కబడ్డీ బాలురలో కళ్యాణ్ జట్టు(విజేత), సురేందర్ జట్టు(రన్నర్)గా నిలిచాయి. బాలికల్లో గోదావరి జట్టు(విజేతగా), సురేందర్ జట్టు(రన్నర్) నిలిచాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, జిల్లా క్రీడల యువజన అధికారి ముత్తెన్న, బాలభవన్ సూపరింటెండెంట్ ప్రభాకర్, సాయిబాబా, సురేష్, గంగాదాస్, ప్రశాంత్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జప్తు ఝలక్..!

- ఎస్సారెస్పీ భూసేకరణ పరిహారం జాప్యంపై కోర్టు సంచలన తీర్పు
- కలెక్టరేట్ కార్యాలయ ఆస్తులు జప్తు చేయాలని ఆదేశం
- రైతులతో వచ్చిన పిటిషనర్ల తరపు న్యాయవాది, కోర్టు సిబ్బంది
- పరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగిన వైనం

సుభాష్‌నగర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాల్వలకు భూసేకరణలో నష్టపరిహారం చెల్లింపులో జాప్యం కావడంపై కోర్టు ఝలక్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి కలెక్టర్ కార్యాలయ ఆస్తులు జప్తు చేయాలని నిజామాబాద్ అదనపు జిల్లా జడ్జి సంచలన తీర్పు వెల్లడించారు. కోర్టు తీర్పు మేరకు ఆస్తుల జప్తు కోసం పిటిషనర్ల తరపు న్యాయవాది ఎర్రం గణపతి, రైతులతో బుధవారం కొత్త కలెక్టరేట్‌కు వచ్చారు. న్యాయవాది, కోర్టు సిబ్బంది, రైతులు అక్కడికి చేరుకోవడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. మిగతా నగదు రూ. 11,71,747 డిపాజిట్ చేస్తామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో న్యాయవాది, కోర్టు సిబ్బంది, రైతులు వెనుదిరిగారు.

కేసు నేపథ్యం ఇది..

ప్రభుత్వం 1963లో గోదావరి నదిపై శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ప్రారంభించింది. 1977లో పనులు పూర్తి కావడంతో ప్రాజెక్ట్ ప్రారంభమైంది. తదనంతరం ఎస్సారెస్పీ కాల్వల నిర్మాణ పనులకు భూసేకరణ చేపట్టారు. భూములు కోల్పోయిన రైతులకు 1998లో ప్రభుత్వం పరిహారం చెల్లించింది. పరిహారం తక్కువ మొత్తంలో చెల్లించడంతో బాల్కొండ జోన్‌కు చెందిన భూములు కోల్పోయిన 44 మంది రైతులు 2003 కోర్టును ఆశ్రయించారు. భూ నష్టపరిహార దావాలలో వారికి అనుకూలంగా 2012, ఆగస్టు 13న తీర్పు వెల్లడించింది. తీర్పు అమలు కోసం రైతులు అమలు పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం రూ. 62,85,100కు గాను 2019 అక్టోబర్ 24న రూ. 51,13,353లను కలెక్టర్ కోర్టులో డిపాజిట్ చేశారు. మిగతా రూ. 11,71,747 డిపాజిట్ చేయలేదని మరో అమలు పిటిషన్ వేశారు. దీంతో నిజామాబాద్ అదనపు జిల్లా జడ్జి కలెక్టర్ కార్యాలయ ఆస్తులను కోర్టు బెయిలిఫ్ ద్వారా జప్తు చేయాలని 2022, అక్టోబర్ 31 సంచలన తీర్పునిచ్చారు.



కలెక్టరేట్ ఏవోతో మాట్లాడుతున్న న్యాయవాదులు

“ 8 గుంటలు కోల్పోయాను



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాల్వ ల భూసేకరణలో మా కు టుంబం 8 గుంటలు కోల్పోయింది. ప్రభుత్వం పరిహా రం తక్కువ మొత్తంలో చెల్లించింది. సంతృప్తి చెందని మేము న్యాయవాది ద్వారా కోర్టును ఆశ్రయించాం. కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. పూర్తిస్థాయిలో డిపాజిట్ చేసి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– తోకల అశోక్, రైతు, బాల్కొండ

త్వరలోనే డిపాజిట్ చేస్తామన్నారు



భూములు కోల్పోయిన రైతులకు డిపాజిట్ చేయని నగ దు విషయంలో కోర్టును ఆశ్రయించగా, అక్టోబర్ 31న కలెక్టర్ కార్యాలయ ఆస్తులు కోర్టు బెయిలిఫ్ ద్వారా జప్తు చేయాలని ఆదేశించింది. బుధవారం నోటీసులిచ్చి సామగ్రి జప్తు చేసేందుకు వచ్చాం. క్యాలిక్యులేషన్ మెమోలో ఎర్రర్ ఉందని, రెక్టిఫై చేసుకుని, ఆర్మూర్ ఆర్డీవో ద్వారా త్వరలోనే మిగతా నగదు డిపాజిట్ చేస్తామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ చెప్పారు.

– ఎర్రం గణపతి, పిటిషనర్ల తరపు న్యాయవాది

ఊపిరి తీసిన ‘మాస్టర్ ప్లాన్’

- ఇండస్ట్రియల్ జోన్‌తో నష్టం
- మనస్తాపంతో రైతు ఆత్మహత్య
- ఆందోళనకు దిగిన బాధితులు
- రోజంతా కొనసాగిన నిరసనలు

కామారెడ్డి టౌన్: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన పయ్యావుల రాములు(42)కు కామారెడ్డి పట్టణ శివారులోని ఇల్చిపూర్ వద్ద 3 ఎకరాల సాగుభూమి ఉంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాములు ఆ భూమిని గతంలోనే అమ్మకానికి పెట్టాడు. మున్సిపల్ నూతన మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనల్లో ఆయన భూమిని ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చడంతో భూమి అమ్ముడుపోవడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన రాములు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు బుధవారం మృతదేహాన్ని ట్రాక్టర్‌లో తీసుకుని బల్దియా వద్ద ఆందోళన చేయడానికి బయలుదేరగా.. పోలీసులు కామారెడ్డి బస్టాండ్ వద్ద అడ్డుకున్నారు. దీంతో రైతులు రెండు గంటలపాటు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరిగింది. రైతులు మృతదేహాన్ని అక్కడే వదిలేసి బల్దియా కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేశారు. అనంతరం పోలీసులు కొత్తబస్టాండ్ వద్దనున్న మృతదేహాన్ని అశోక్‌నగర్ కాలనీ, రైల్వేగేట్, పాత బస్టాండ్ మీదుగా జిల్లా ఆస్పత్రికి తరలించారు.



మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు



పయ్యావుల రాములు(ఫైల్)

బల్దియా వద్ద ధర్నా

తన భర్త మృతదేహన్ని అనుమతి లేకుండా పోలీసులు ఏరియా ఆస్పత్రికి తరలించడంపై మృతుడి భార్య శారద నిరసన తెలిపింది. ఆమె పెద్ద కుమారుడు అభినందు, చిన్న కుమారుడు నిషాంత్, బంధువులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులు మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద ఆందోళన చేశారు. కమిషనర్ కమీషనర్ రాగానే ఆయనతో వాగ్వాదానికి దిగారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆందోళన కొనసాగింది. ఆందోళనలో లింగాపూర్, అడ్లూర్‌ఎల్లారెడ్డి, ఇల్చిపూర్ తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

‘అర్సపల్లి ఆర్వోబీ’కి రూ.137 కోట్లు

- కేంద్రం వాటా రూ. 127.50 కోట్లు
- ఎంపీ అర్వింద్
- రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

సుభాష్‌నగర్: మన్మాడ్-సికింద్రాబాద్ రైల్వే లైన్ మధ్య ఎల్‌సీ నెంబర్ 191 అర్సపల్లి వద్ద నాలుగు లైన్ల ఆర్వోబీ నిర్మాణానికి రూ. 137.50 కోట్ల మంజూరుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ అర్సపల్లి ఆర్వోబీ నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా కాలయాపన చేస్తోందని ఆరోపించారు.

తాను రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడంతో సానుకూలంగా స్పందించి రూ. 127.50 కోట్లు సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిందని, ఇందుకు ధన్యవాదాలు తెలిపారు. అర్సపల్లి వద్ద నాలుగు లైన్ల ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి రైల్వే పనులకు రూ. 12 కోట్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ. 115.50 కోట్లు కేంద్ర ప్రభుత్వానివేనని తెలిపారు. అప్రోచ్‌లు, బ్రిడ్జి నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని, నిధులు మాత్రం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నుంచి విడుదలవుతాయని ఎంపీ పేర్కొన్నారు. ఆర్వోబీ నిర్మాణంలో భూసేకరణ ఇది వరకే పూర్తయ్యిందని, ఇకనైనా మంత్రి ప్రశాంత్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు త్వరగా ఇప్పించాలని ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి చేశారు.

డాంబర్ ప్లాంట్ వద్దని ఆందోళన

కామారెడ్డి టౌన్: డాంబార్ ప్లాంట్ ఏర్పాటుతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతారని, వెంటనే ప్లాంట్‌ను తొలగించాలని స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. దీంతో ప్లాంట్ నిర్వాహకుడు వెంటనే ప్లాంట్‌ను తొలగిస్తున్నట్లు రాతపూర్వకంగా రాసిచ్చాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు వద్ద బుధవారం చోటుచేసుకుంది. జీఆర్ కాలని, ఈఎస్ఆర్ గార్డెన్, హౌసింగ్ బోర్డు పరిధిలో ఈఎస్ఆర్ గార్డెన్‌కు ఎదురుగా అమీన కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో డాంబార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఈరోజు ప్లాంట్‌ను మంత్రి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని భావించినా అనివార్య కారణాలతో మంత్రి పర్యటన రద్దయింది. విషయం తెలుసుకున్న రెండు కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున ప్లాంట్ వద్దకు చేరుకుని ప్రధాన రహదారిని దిగ్బంధించి ధర్నా చేపట్టారు. ప్లాంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. దాంతో దిగివచ్చిన ప్లాంట్ నిర్వాహకుడు ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం లేదని, ఆ స్థలాన్ని పార్కింగ్ కోసం వాడుకుంటామని రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. జనావాసాల మధ్య ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పొల్యూషన్ సమస్య ఏర్పడుతుందని, డాంబార్ వాసనతో పిల్లలు, పెద్దలు అనారోగ్యంతో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ప్లాంట్ ఏర్పాటు చేయవద్దని మున్సిపల్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.



కామారెడ్డిలోని పాత జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

ప్రశాంతంగా పీజీ బ్యాక్‌లాగ్ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్‌క్యాంపస్‌లో బుధవారం పీజీ బ్యాక్ లాగ్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 238 మంది విద్యార్థులకు గానూ 186 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షకు 186 మందికి 164 మంది హాజరయ్యారని తెలిపారు. ఆమె పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. అడిషనల్ కంట్రోలర్ సాయిలు ఉన్నారు.

నేడు ఆర్‌టీఐ యాక్ట్‌పై వర్క్‌షాప్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో గురువారం 'ఆర్‌టీఐ యాక్ట్- అవేర్‌నెస్ అండ్ అండర్‌స్టాండింగ్' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్‌లో ముఖ్యవక్తగా రాష్ట్ర సమాచార కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్, తెయూ వీసీ డి.రవీందర్ హాజరవుతారని ఆమె తెలిపారు. వర్సిటీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక





యశ్వంత్, సమిత్

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులకు యశ్వంత్‌కుమార్(అండర్-23), జీఆర్ సమిత్(అండర్-18) ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 10వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరగనున్న జాతీయస్థాయి రోడ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొననున్నారు. క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ కృపాకర్‌రెడ్డి, భూలోకం విజయకాంత్‌రావు, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య అభినందించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు

ఇందల్వాయి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పడింది. ఈ నెల 2న డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మేఘ్యనాయక్ తండాకు చెందిన మూడ్ ధరిసింగ్ పట్టుపడ్డారు. ఆయనను కోర్టులో హాజరుపర్చగా రెండో అదనపు కోర్టు జడ్జి ఖాదిర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు.

మాల్యాద్రిరెడ్డిని పరామర్శించిన స్పీకర్

కోటగిరి: బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాల్యాద్రిరెడ్డి తండ్రి అంకిరెడ్డి ఇటీవల మరణించారు. ఆయనను బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోటగిరి మండలం కొత్తపల్లి క్యాంపులోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. జడ్పీటీసీ శంకర్ పటేల్, వల్లేపల్లి శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ కల్లూర్ సిరాజ్, ఎజాజ్ ఖాన్, అబ్దుల్ హమీద్, కొల్లూర్ కిశోర్, సునిల్ చౌదరి తదితరులు ఉన్నారు.



మాల్యాద్రిరెడ్డిని పరామర్శిస్తున్న స్పీకర్ పోచారం

లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలి

ఇందూరు: లూయిస్ బ్రెయిలీని అంధులు ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అన్నారు. నగరంలోని స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బ్రెయిలీ తన చిన్న వయసులోనే చూపుని కోల్పోయి ఆత్మస్థైర్యంతో అంధుల కోసం లిపిని కనుగొన్నాడన్నారు. అంధులకు విద్యాభాసం అందిస్తున్న స్నేహ సొసైటీ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ఐదుగురు అంధులను సన్మానించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

అనంతరం బ్రెయిలీ లిపిలో ముద్రించబడిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఐసీడీఎస్ ఇంచార్జి పీడీ సుధారాణి, ఇందిరా, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, సాయన్న, రాజేందర్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఖలీల్‌వాడి: మోపాల్ మండలంలోని కంజరలో గల మహాత్మాజ్యోతిబాపులే బీసీ వెల్ఫేర్ రెసిడెన్సి (బాలుర) పాఠశాలను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీజినల్ కోఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సంయుక్త, హెల్త్ సూపర్‌వైజర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి పద్మావతి

పశువైద్యశాలలో ఫర్నిచర్ ధ్వంసం

- తీసుకెళ్లిన గ్లాసెస్ అడిగినందుకు..
- బీఆర్ఎస్ నాయకుడి నిర్వాకం

ఎడపల్లి: పశువైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్ గ్లాసెస్ తీసుకుపోయిన ఓ వ్యక్తిని తిరిగి ఇవ్వమన్నందుకు ఆస్పత్రిలోని ఫర్నిచర్ ధ్వంసం చేశాడు. వివరాలు.. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సమీరుద్దీన్ వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. మంగళవారం వైద్యశాలకు జంలం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దొడ్డి శ్రీనివాస్ వచ్చాడు. అక్కడ సమీరుద్దీన్ రెబన్ గ్లాసెస్ తీసుకొని వెళ్లిపోయాడు. ఆయన వెళ్లాక గమనించిన సమీరుద్దీన్ తన కంటి అద్దాలు తనకు ఇవ్వాలని ఫోన్ చేసి అడిగాడు. తిరిగి ఇవ్వకపోడంతో వెటర్నరీ అసిస్టెంట్ ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో శ్రీనివాస్ పశువైద్యశాలకు వచ్చి సమీరుద్దీన్‌ను దుర్భాషలాడుతూ, ఆఫీసులోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై వెటర్నరీ అసిస్టెంట్ సమీరుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బీఆర్ఎస్ మండల నాయకులు రాజీ కుదిర్చారు. సమీరుద్దీన్‌తో మండల బీఆర్ఎస్ నేతలు మాట్లాడి అతని రెబన్ గ్లాసెస్ ఇప్పించి, శ్రీనివాస్‌తో క్షమాపణ చెప్పించినట్లు తెలిసింది. దీంతో వెటర్నరీ అసిస్టెంట్ ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకున్నట్లు సమాచారం.



పశువైద్యశాలలో విరిగిపోయిన కుర్చీలు

తెయూ వీసీ రవీందర్‌కు అవార్డు



తెయూ(డిచ్‌పల్లి): ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 'ఓయూ గ్లోబల్ అల్యూమినీ మీట్-2023' లో తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి.రవీందర్ కు 'రీసెర్చ్ అప్రిసియేషన్ అవార్డ్' లభించింది. ఫిజిక్స్‌లో ఆయన చేసిన పరిశోధనకు ఈ అవార్డు అందుకున్నారు. ఓయూ వీసీ రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ సమక్షంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కేజేరావ్, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ రఘు కల్లూరీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

హసాకొత్తూర్ వాసికి..



కమ్మర్‌పల్లి: మండలంలోని హసాకొత్తూర్‌కు చెందిన బాస అశోక్‌కు పేటెంట్ అవార్డు దక్కింది. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అశోక్ గృహ అవసరాల్లో క్లీనింగ్‌కు ఉపయోగపడే ఇన్సిటు జనరేటర్ నానో కాంపొసిట్ ఎగ్ షెల్ పౌడర్ తయారీపై పరిశోధన చేశారు. ఇందుకు అశోక్‌కు అవార్డు లభించింది. మంగళవారం రాత్రి ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో అధికారులు అశోక్ పరిశోధనకు పేటెంట్ హక్కులు కలిపిస్తూ ప్రశంసా పత్రంతో అవార్డును అందజేశారు.

7న ఉపన్యాస పోటీలు

నిజామాబాద్‌నాగారం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో భాగంగా యువతకు ఈ నెల 7న నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 15–29 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ జీవితం–ఆయన నుంచి యువత నేర్చుకోవాల్సిన సందేశం అనే అంశంపై మాట్లాడాలని తెలిపారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామని వివరించారు. వివరాలకు 9100435410 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'వన్ టైం సెటిల్‌మెంట్'ను సద్వినియోగం చేసుకోవాలి

ఇందూరు: బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా మంజూరు చేయబడి పీఏసీఎస్‌ల నుంచి పంపిణీ చేసిన రుణాలకు (క్రాప్ లోన్ కాకుండా) ఏర్పాటు చేసిన వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీమ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2022 మార్చి 31నాటికి కాలపరిమితి ముగిసిన వాటికి వన్ టైం సెటిల్‌మెంట్ స్కీంలో 30 శాతం వడ్డీ రాయితీ కల్పించామన్నారు. ఈ నెలాఖరు వరకు ఓటీఎస్ స్కీం అమల్లో ఉంటుందన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



క్రీడాకారులను సన్మానిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని 11 పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. బుధవారం బాల్కొండలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. సమాజంలో దైవం, తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదే అన్నారు. పాఠశాలల్లో దయానంద్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. దయానంద్‌రెడ్డి తన వియ్యంకుడు కావడం గర్వంగా ఉందన్నారు. తన సంపదనలో కొంత పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారన్నారు. అలా అందరు ముందుకు వస్తే పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే క్రీడాలను అలవాటు చేయాలన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను సన్మానించారు.

కష్టపడి సంపాదించడం నేర్చుకోవాలి

సమాజంలో కష్టపడి సంపాదించుకోవడం నేర్చుకోవాలని పారిశ్రామికవేత్త దయానంద్‌రెడ్డి అన్నారు. అడ్డదారుల్లో సంపాదించిన డబ్బు ఏదో రూపంలో మనకు తెలియకుండానే పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, ఎంఈఓ రాజేశ్వర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ బూస సునీత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి

ఆర్మూర్‌టౌన్: జిల్లాహ్యాండ్ బాల్ జట్టు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవాలని హ్యాండ్ బాల్ హడాక్ కమిటీ చైర్మన్ గంగమోహన్ చక్రు అన్నారు. ఆర్మూర్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో జూనియర్ ఉమెన్ హ్యాండ్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ప్రతిభ కనబర్చి జట్టును గెలిపించాలన్నారు. ఖమ్మంలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. అనంతరం క్రీడాకారులకు ఆయన క్రీడాదుస్తులను వితరణ చేశారు. పింజ సురేందర్, గట్టడి రాజేష్, కోచ్ రాజేశ్వర్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేందర్, కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



క్రీడాదుస్తులు అందజేస్తున్న ప్రతినిధులు

బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు



శిక్షణ శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు

పెర్కిట్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల కోసం ఉమ్మడి నిజామాబాద్ క్రీడాకారులను బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఎంపిక చేశారు. పోటీలకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి 90 మంది బాల బాలికలు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఈ నెల 5 నుంచి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్ తెలిపారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో ఈ నెల 12నుంచి 14 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

నిజామాబాద్ సిటీ: నగరంలోని బ్యాంక్ కాలనీ(పాంగ్రా)లో వరదలు, అగ్నిప్రమాదాల నివారణకు, వాటిని ఎలా ఎదుర్కోవాలో అనే అంశాలపై బుధవారం ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. 10వ బెటాలియన్ విజయవాడ టీం కమాండర్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ వితన్ సింగ్ మాట్లాడుతూ వరదలు వచ్చినప్పుడు, గ్యాస్ లీక్ అయినప్పుడు బెటాలియన్ సిబ్బంది తక్షణమే వచ్చి సహాయం చేస్తారన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కాలేజీలు, ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ అనిల్‌కుమార్, కార్పొరేటర్ ప్రమోద్ పాల్గొన్నారు.



వన్యప్రాణుల వేటగాడి అరెస్టు

లింగంపేట: లింగంపేట మండలం మోతె బట్టిప్ప గడ్డ తండాకు చెందిన వన్యప్రాణుల వేటగాడు కొర్ర రవిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. కొర్ర రవి మంగళవారం రాత్రి తన పంట చేను వద్ద కొండ గొర్రెను వేటాడినట్లు 100 నంబరుకు సమాచారం రావడంతో లింగంపేట బ్లూ కోల్ట్ సిబ్బంది బన్సిలాల్, మహ్మద్ షబ్బీర్ తండాకు చేరుకొని తనిఖీ చేశారు. రవి వద్ద గాయపడిన కొండ గొర్రె, మరో పాత్రలో కొండ గొర్రె కూర, మూడు కత్తులు, ఒక త్రాసు, అరకిలో బాటు, రెండు చార్జింగ్ లైట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని డీఎస్పీకి సమాచారం ఇవ్వగా ఆయన సీఐ శ్రీనివాస్, లింగంపేట ఎస్సై శంకర్ ఘటన స్థలానికి చేరుకొని విచారించారు. అడవికి దగ్గరగా ఉన్న తన పొలం వద్దకు వస్తున్న వన్యప్రాణులను అప్పుడప్పుడు వేటాడుతున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. మంగళవారం రాత్రి పంట చేను వద్ద ఇనుప వలను ఏర్పాటు చేయగా మూడు కొండగొర్రెలు చిక్కినట్లు వేటగాడు తెలిపాడు. వల నుంచి తీస్తున్న సమయంలో ఒక కొండగొర్రె పారిపోగా మిగిలిన రెండింటిని తీసుకొచ్చి ఒకదానిని కోసి కూర వండుకున్నట్లు తెలిపాడు. మరొకటి మరుసటి రోజు కోసి ఇతరులకు విక్రయించడానికి సిద్ధం చేసుకున్నట్లు నేరం ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి అటవీ శాఖ అధికారులకు కొర్ర రవిని అప్పగించారు. అటవీ శాఖ రేంజ్ అధికారి ఓంకార్ మాట్లాడుతూ.. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

కిసాన్‌నగర్‌లో పట్టపగలే దొంగతనం

- 15 తులాల బంగారం, రూ.75 వేల నగదు చోరీ


బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో తాళం వేసిన ఇంట్లో బుధవారం పట్టపగలే దొంగలు చొరబడి 15 తులాల బంగారం, రూ.75 వేల నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు.. గ్రామానికి చెందిన పడకంటి దశరథ్ కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం బైక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 15 తులాల బంగారం, రూ.75 వేల నగదును ఎత్తుకెళ్లారు. నిర్మల్ నుంచి సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగిలి ఉండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై గోపి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంటి సమీపంలో సీసీ కెమెరాలు ఉండటంతో దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై తెలిపారు. ఫింగర్ ప్రింట్ బ్యూరో అధికారి రాజేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

గంజాయి విక్రేత అరెస్టు

ఆర్మూర్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్ తెలిపారు. ఆర్మూర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మెండోరా మండలం పోచంపాడ్ గ్రామానికి చెందిన చంద్రగిరి కృష్ణ ఆదిలాబాద్ జిల్లా లోకరి నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పోచంపాడ్‌లో కాకతీయ కెనాల్ వద్ద బైక్‌పై గంజాయి విక్రయిస్తున్నప్పుడు పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి 600 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



భార్గవి మృతదేహం

భిక్కనూరు: కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో ఆనంద్‌గౌడ్ తెలిపిన వివరాలు.. భిక్కనూర్‌కు చెందిన గంథం భార్గవి(26)కి అదే గ్రామానికి చెందిన నరేశ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని నెలలుగా భార్గవి కడుపు నొప్పితో బాధపడుతోంది. వారం క్రితం ఆమె తన పిల్లలను తీసుకుని తల్లిగారింటికి వచ్చింది. కడుపు నొప్పి తీవ్రంగా ఉందని తరుచు బాధపడేది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు ఉదయం లేచే సరికి భార్గవి దూలానికి వేలాడుతూ కనిపించింది. వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు చెప్పారు. భార్గవి తండ్రి సిద్ధరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

దోమకొండ: మండలంలోని అంచనూరు గ్రామానికి చెందిన గెరిగెంటి లస్మయ్య(57) ఒంటరితనంతో బాధపడుతూ బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. లస్మయ్య భార్య ఎనిమిదేళ్ల కిత్రం చనిపోయింది. దీనికి తోడు ఆయన కడుపు నొప్పి, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్యహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి కోడలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

అప్పుల బాధతో మరొకరు..



రమేశ్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని కొత్త బస్టాండ్ సమీపంలో గల మమత లాడ్జీలో నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చాందా మండలం మాచారం గ్రామానికి చెందిన మాలవు రమేశ్(51) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. రమేశ్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కాగా మంగళవారం రాత్రి ఆర్మూర్‌లోని మమత లాడ్జీలో ఓ గది తీసుకున్నాడు. ఉదయం సిబ్బంది చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్నాడు. కాగా రమేశ్ అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

గోదాంలో అగ్నిప్రమాదం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి గోదాంరోడ్‌లో శిథిలావస్థలో ఉన్న పాత గోదాంలో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు అగ్నిమాపక శకటానికి ఫోన్ చేయడంతో మంటలను ఆర్పివేశారు. వివరాలు.. చెత్తను ఏరుకునే ఓ వ్యక్తి ఈ గోదాం వద్ద మంట పెట్టడంతో అవి చెలరేగి పెద్ద ఎత్తున వ్యాప్తి చెందాయని స్థానికులు తెలిపారు. ఈ గోదాంలో గతేడాది సైతం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.

